క్లుప్తంగా

వెంకన్న సేవలో పేర్ని నాని దంపతులు



మచిలీపట్నంటౌన్: ఉగాది పర్వదినం సందర్భంగా తిరుమలలోని వేంకటేశ్వరస్వామి వారిని ఎమ్మెల్యే పేర్ని నాని, జయసుధ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో మనందరి ఇళ్లలో శుభాలు, ప్రతి ఒక్కరికి మెరుగైన విజయాలు కలగాలని, ఆనందాలు వెల్లివిరియాలని వేంకటేశ్వర స్వామిని కోరుకున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

వేద పండితులకు నగదు పురస్కారం



మోపిదేవి: ఉగాది పర్వదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పనిచేస్తూ 62 ఏళ్లు నిండిన వేద పండితులు, అర్చకులకు రాష్ట్ర దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నగదు పురస్కారం అందజేశారు. మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో 62 ఏళ్లు నిండిన ఆలయ అర్చకుడు కాశీభట్ల బాలకృష్ణ శర్మ, విజయవాడ విజయేశ్వర స్వామి వారి దేవస్థానంలో టీటీడీ వేద పండితులు లంక పూర్ణానంద శర్మలకు ఉగాది పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ. 10,116లను ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు అందజేసి ఘనంగా సన్మానించారు. అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐ శ్రీనివాస్, వేద పండితులు, అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు వస్త్రాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నోబుల్ కాలనీలోని బాల సదన్‌లో ఉంటున్న అనాథ చిన్నారులకు మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను బహూకరించారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఆకెళ్ల పవన్ కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చిన్నారులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించిన బాలబాలికలు ఆనందోత్సాహాలతో గడిపారు.

ఆటో డ్రైవర్లకు వస్త్రదానం



చల్లపల్లి: ఉగాది పండుగ సందర్భంగా అరవై ఏళ్లు దాటిన సీనియర్ ఆటో డ్రైవర్లకు వస్త్రదానం చేశారు. బుధవారం స్థానిక బస్టాండ్ వద్ద చిముటూరి వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో సీనియర్ డ్రైవర్లకు వస్త్రాలు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరిముల్లా, వెనిగళ్ల వసంతరావు, రావుల దావీదు పాల్గొన్నారు.

14 మంది జూదరుల అరెస్ట్

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీకాకుళం, వేములపల్లిలో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తున్న 14 మందిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... పేకాట, కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు శ్రీకాకుళం సిబ్బందితో వెళ్లి నలుగురు పేకాట రాయళ్లను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.3,240 నగదును స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామంలో మరో చోట కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి ఒక కోడి పుంజుని, రూ.1,640 నగదుని స్వాధీనం చేసుకున్నారు. వేములపల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,090 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని దొడ్డి గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ 1.50 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ పరిమి వంశీ చేతుల మీదుగా బుధవారం ఆలయ కమిటీకి ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, సచివాలయ కన్వీనర్లు పరిమి సింధూర, పరిమి విష్ణు, నాయకులు కోనేరు సుబ్బారావు, ఉప సర్పంచ్ అంకం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఉగాది వేడుకలు

- సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిన పండుగ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల పంచాంగ శ్రవణాలు



ప్రత్యేక అలంకరణలో కోడూరు కల్యాణ వెంకటేశ్వరుడు



మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పంచాంగ శ్రవణం

కోడూరు: తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగను అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే తమ ఇష్టదైవానికి పూజలు చేసి, షడ్రుచుల ఉగాది పచ్చడిని ఆస్వాదించారు. పలు ఆలయాల్లో ప్రచాంగ శ్రవణాలు జరిగాయి. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఉగాది వేడుకలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గర్భాలయాన్ని కొబ్బరాకులతో మండపంగా చేసి మూలమూర్తులను విశేష అలంకారంలో తీర్చిదిద్దారు. ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు పంచాంగ శ్రవణం చేయగా ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ పర్యవేక్షించారు. వీవర్స్ కాలనీలోని అయ్యప్ప స్వామి వారి దేవాలయం వద్ద ఉగాదిని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అయ్యప్ప మూలవిరాట్‌కు పంచామృత ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయంలో పంచాంగ శ్రావణం నిర్వహించారు.

ఆనందోత్సాహాలతో ఉగాది

కృత్తివెన్ను: తెలుగు నూతన సంవత్సరాది శోభకృత్ నామ సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృత్తివెన్ను శివాలయంతో పాటు పలు ఆలయాల్లో నూతన సంవత్సర పంచాంగ శ్రవణాన్ని పండితులు నిర్వహించారు. నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని పండితులు ఆశీర్వదించారు.

బంటుమిల్లి శివాలయంలో

బంటుమిల్లి: బంటుమిల్లి శివాలయంలో వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేద పండితులు గూతాల పుల్లయ్యశాస్త్రి పంచాంగ శ్రవణం చేసి ఫలితాలను వివరించారు. పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయంలో రొంపిచర్ల హనుమంతాచార్యులు, వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవన్ తదితర పండితులు పంచాంగ శ్రవణం ద్వారా భక్తులకు వారివారి గ్రహరాశులు, నక్షత్ర ఫలితాలను వివరించారు. ఈ సందర్భంగా వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బేతనబొట్ల గంగాధరరావు దంపతులను పండితులు పుల్లయ్య శాస్త్రి ఘనంగా సత్కరించారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కృత్తివెన్ను శివాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

గూడూరు: గూడూరు మండలంలో తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. తరగటూరులోని చెన్నకేశవ స్వామి ఆలయంలో కార్యనిర్వహణాధికారి టీవీ మోహన్‌రావు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది.

పుణ్యక్షేత్రాల్లో పంచాంగ శ్రవణం

మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం, పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి వారి దేవస్థానాల్లో శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం వేద పండితులు ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్య శర్మచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఉదయం స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. ఉగాది పచ్చడి భక్తులకు అందించారు. పంచాంగ శ్రవణం అనంతరం భక్తులకు పంచాంగ పుస్తకాలు పంపిణీ చేశారు.

శ్రీవాసవి క్షేత్రంలో..

పెడన: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పండితులు శ్రీశుభకృత నామ ఫలితాలను భక్తులకు తెలిపారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ (చిన్న) పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఐలూరి విశ్వనాథ శర్మ గణాపాఠి పంచాంగ శ్రవణం చేసి భక్తులకు వారి వారి గ్రహరాశులు, నక్షత్ర ఫలితాలను వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు స్వర్ణసాయిబాబా, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

చల్లపల్లి: స్థానిక ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గీతా మందిరంలో పంచాగ శ్రవణం నిర్వహించారు. వేద పండితులు మార్తి వెంకట శ్రీనివాసుచే పంచాంగ శ్రవణం, వాసవీ భక్త బృందంచే గీతామృత పారాయణ, వాసవీ క్లబ్ చల్లపల్లి శాఖ అధ్యక్షుడు గోళ్ల ద్రోణ పూర్ణ చంద్రరావుచే వాసవీమాత జీవిత చరిత్ర ప్రవచనం జరిగాయి. సంఘ అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు, ప్రధాన కార్యదర్శి వరదా హరి గోపాల్, కొల్లిపర సురేంద్ర పర్యవేక్షించారు.

నగరంలో శోభకృత్ సందడి

మచిలీపట్నంటౌన్: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని నగర వాసులు బుధవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నగరంలోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాలు జరిగాయి. చిట్టి పిళ్లారయ్య ఆలయంలో త్యాగరాజ సంగీత విద్యాపీఠం స్వర్ణోత్సవాల కార్యక్రమం ప్రారంభమైంది. విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ పంచాంగ శ్రవణం చేయగా విద్యాపీఠం ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి స్వాగతోపన్యాసం చేయగా సింగరాజు కల్యాణి, కాశీపట్నపు ఉమా, ఎల్. విజయలక్ష్మీ సంగీత కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కె. శేషులత విశ్వనాథ్, డాక్టర్ ఎస్. సీతా చంద్రశేఖర్ గాత్ర యుగళం ఆహూతులను ఆకట్టుకుంది. వల్లెగూడెంలోని అజ్మీర్ బాబా దర్గా సేవా సమాజం ఆధ్వర్యంలో కాజా గరీబ్ నవాజ్ జెండా వద్ద ఉగాది వేడుకలు నిర్వహించారు. సేవా సమాజం నిర్వాహకుడు సయ్యద్‌పీర్, వైజ్‌మెన్ క్లబ్ ప్రతినిధి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సయ్యద్ బాజీ పాల్గొన్నారు. గాంధీబొమ్మ శివాలయం, శ్రీ రంగనాయక స్వామి ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో, శంకరమఠం, చిట్టి పిళ్లారయ్య స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. గాంధీ నగర్‌లోని ఉదయపు నడక మిత్ర మండలి, మహిళా విభాగం ఆధ్వర్యంలో పోర్టురోడ్డులోని మెహర్‌బాబా ఆడిటోరియంలో పంచాంగ శ్రవణం జరిగింది. 29వ డివిజన్‌లోని చాడేశ్వరి సహిత రామలింగేశ్వరస్వామి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.



బందరు రంగనాయకస్వామి ఆలయంలో పూజలు

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

ఎమ్మెల్యే సింహాద్రి



అవనిగడ్డ: నియోజకవర్గంలోని ప్రజలంతా సంతోషంగా ఉండాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ది వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మన సుబ్బారావు, పలువురు సభ్యులు, విశ్రాంతి ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి పెట్టాలి

ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్

గన్నవరం: ఆరోగ్యకరమైన నవ సమాజం కోసం యువత క్రీడలపై దృష్టి సారించాలని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కె.ప్రసాద్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. తొలుత ఈ పోటీలను ప్రారంభించిన టీఎస్ఆర్‌కే మాట్లాడుతూ..రానున్న రోజుల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మరిన్ని పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోటీల స్పాన్సర్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు సంకాబత్తు వెంకట్‌ను అభినందించారు. అనంతరం ఈ పోటీల్లో విజేతగా నిలిచిన గన్నవరం పోలీసుల జట్టుకు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు, హెచ్‌సీఎల్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఏసీబీ సీఐ వెంకటరమణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.బాలకృష్ణమూర్తి, కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్.కిషోర్, రోటరీక్లబ్ కార్యదర్శి జీ రవిబాబు పాల్గొన్నారు.

గతం కంటే గణనీయంగా!

- గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషకాహారం కిట్లు
- గర్భం నుంచి ఐదేళ్ల పిల్లల వరకు పౌష్టికాహారం
- ప్రీ స్కూల్స్‌లో ఆటపాటలతో విద్య
- పెరిగిన చిన్నారుల సంఖ్య



అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులతో సిబ్బంది



పౌష్టికాహారం అందుకుంటున్న కంభాల నాగమౌనిక

మోపిదేవి: మంచి ఆహారం అందిస్తే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. తద్వారా సమాజం బాగుంటుంది అనే భావనతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రధానంగా విద్య, వైద్య రంగాలపై దృష్టి కేంద్రీకరించి వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మండలంలోని 31 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో విలువలతో కూడిన పౌష్టికాహారం మెనూ ప్రకారం ప్రతి రోజూ పిల్లలకు అందిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. పిల్లలకు ఆటపాటలతో విద్య అందిస్తున్నారు. మంచి అలవాట్లు, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వర్క్ బుక్స్ చేయించడంతోపాటు పలు సందేశాత్మక కథలు నేర్పుతున్నారు. దీంతో అంగన్‌వాడీ స్కూల్స్‌లో పిల్లల సంఖ్య గతం కంటే గణనీయంగా పెరిగింది. పౌష్టికాహారంపై అవగాహన కల్పించడంతో గర్భిణులు, బాలింతలు స్వయంగా కేంద్రానికి వచ్చి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు తీసుకువెళుతున్నారు.

సంపూర్ణ పోషణ..

మండలంలో ప్రీ స్కూల్ పిల్లలు 268మంది, 7 నెలల నుంచి 3 సంవత్సరాల (టీహెచ్ఆర్) పిల్లలు 693 మంది, గర్భిణులు 166 మంది, బాలింతలు 142 మంది ఉన్నారు. టీహెచ్ఆర్ పిల్లలకు ప్రతి నెలా 2.50 లీటర్ల పాలు, గర్భిణులు–బాలింతలకు రోజూ 200 ఎంఎల్ లీటర్ల పాలు, 3 నుంచి 5 సంవత్సరాల (ప్రీ స్కూల్) పిల్లలకు రోజూ 100 ఎంఎల్ పాలతో గుడ్లు, భోజనం అందిస్తారు. టీహెచ్ఆర్ పిల్లలకు ఇంటికి బాలామృతం నెలకు 2.50 కిలోలు, కోడిగుడ్లు 25, పాలు 2.5 లీటర్లు, గర్భిణులు–బాలింతలకు 3 నుంచి 6 నెలల వరకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ఇంటివద్ద అందిస్తున్నారు. వైఎస్సార్ కిట్లలో ఒక కిలో రాగిపిండి, కిలో జొన్నపిండి, కిలో అటుకులు, పావుకిలో ఎండి ఖర్జూరం, పావు కిలో చిక్కీలు, పావు కిలో బెల్లం ఉన్నాయి. వీటిని లబ్ధిదారులకు క్రమం తప్పకుండా అందిస్తున్నారు.

పేదలకు ఎంతో మేలు



ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పేద మహిళలకు ఎంతో మేలు చేస్తుంది. ఇన్ని రకాల పౌష్టికాహారం పేదవర్గాల వారు బయట తీసుకోలేరు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్భంలో ఉన్న బిడ్డతో సహా తల్లీ, బిడ్డలకు మంచి పోషక విలువలు గల ఆహారం అందిస్తూ అన్నగా ఆదుకుంటున్నారు.

–వి. శిరీష, మోపిదేవి

స్కూల్‌కు రాలేని వారికి ఇంటివద్దే అందిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రానికి రాలేని గర్భిణులు, బాలింతలకు వారి ఇంటివద్దనే వైఎస్సార్ పోషణ కిట్లు అందిస్తున్నాం. పోషక విలువలు ఉన్న ఈ కిట్లు గర్భంలో ఉన్న బిడ్డతో పాటు తల్లికి కూడా ఎంతో మేలు చేస్తుంది. గతంలో కంటే ఇప్పుడు పిల్లలను తల్లిదండ్రులే ప్రీస్కూల్‌కు పంపడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

జి. పద్మావతి, మండల సూపర్‌వైజర్

గంగాభవానీ ప్రధాన గుడి సంబరం ప్రారంభం



అమ్మవారి పూజలు చేస్తున్న పండితులు

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి ప్రధాన గుడి సంబరం బుధవారం ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త కోట యుగంధర రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తొలి రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కోడూరు, ఐబీపేట, యర్రారెడ్డివారి పాలెం, కృష్ణాపురం, నాయుడుపేట గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ తిప్పి, పశుసంపదను కాపాడాలంటూ అమ్మవారికి మొక్కులు సమర్పించారు. ఆలయంలో పోతురాజు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. చిన్న అమ్మవారి గ్రామోత్సవం ప్రస్తుతం కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్ పేట గ్రామాల్లో కొనసాగుతోంది. ప్రతి ఇంటి వద్ద మహిళలు అమ్మవారి వాహనం ముందు నీటిని వారబోసి భక్తిభావం చాటుతున్నారు. గురువారం అమ్మవారిని త్రిశులధారిణిగా అలంకరించి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ధర్మకర్త యుగంధరరావు తెలిపారు. ఉదయం అమ్మవారికి నైవేద్యాల సమర్పణ, రాత్రి ప్రధాన గుడి జాతర నిర్వహిస్తామని చెప్పారు. ప్రధాన అర్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పీఏసీఎస్ సభ్యులకు డివిడెండ్లు పంపిణీ



రైతులకు డివిడెండ్లు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రైతులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు, రుణ సదుపాయాలు కల్పించేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎల్లప్పుడూ ముందు ఉంటాయని వీరవల్లి పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులకు ఉగాది పర్వదినం సందర్భంగా రూ.6 లక్షల డివిడెండ్‌ను పంపిణీ చేశారు. 2020–21 సంవత్సరానికి గాను 6 శాతం డివిడెండ్‌ను 1380 మంది సభ్యులకు అందించారు. పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, డైరెక్టర్లు గూడవల్లి రత్న సుధాకర్, గోళ్ల రంగారావు చేతుల మీదగా సభ్యులకు డివిడెండ్ అందజేశారు. వ్యవసాయదారులకు అవసరమైన పంట రుణాలు, రైతు నేస్తం, గోల్డ్ లోన్, విద్యా రుణాలతో పాటుగా రైతు మిత్ర గ్రూపులు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇతోధికంగా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో పీఏసీఎస్‌లు బలోపేతమవుతున్నాయని తెలిపారు. రైతులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ సీఈవో కానూర్ల బాలాజీ, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల, మాజీ ఉప సర్పంచ్ రాయి శివపార్వతి పాల్గొన్నారు.

ధ్యాన సాధనతో మార్పు



మాట్లాడుతున్న దీప్తి ప్రసన్న

రామవరప్పాడు: ధ్యాన సాధనతో మంచి మార్పు, మానవత్వం, భౌతిక, ఆధ్యాత్మిక భావాలు సొంతమవుతాయని స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ప్రతినిధి దీప్తి ప్రసన్న అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని శ్రీ శక్తి కల్యాణ మంటపంలో బుధవారం శ్రీ గురు విశ్వస్ఫూర్తి ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గురు విశ్వస్ఫూర్తి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గురు విశ్వస్ఫూర్తి మానవాళికి అనుగ్రహించిన 'ధ్యాన మనో ప్రస్థాన సాధన' ప్రదర్శన నిర్వహించారు. సభాధ్యక్షుడు పైడిపాటి ఉమానాథ శర్మ మాట్లాడుతూ ధ్యాన మనో ప్రస్థాన సాధనతో మనస్సు, బుద్ధి, ఆత్మ స్పష్టతతో మనిషి తనను తాను తెలుసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆథర్ మేక రజనీకాంత్, సత్యవతి, ట్రస్టీలు భానుకృష్ణ, ప్రసాద్, రాఘవరావు, సౌజన్యశ్రీ, జోనల్ ఇన్చార్జి రత్న కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

ఉంగుటూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2021–22 ఆర్థిక సవత్సరంలో మండలంలోని 27 గ్రామాల్లో రూ.7.16కోట్లతో చేపట్టిన 1114 పనుల సామాజిక తనిఖీలో పలు అవకతవకలకు సంబంధించి రూ.95 వేలు రికవరీ చేయవలసిందిగా హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ ఆదేశించారు. ఈనెల 13 నుంచి సామాజిక తనిఖీ బృందం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులు, అవకతవకలను వివరించారు. పనులకు సంబంధించిన తుది నివేదిక వివరాలను మంగళవారం రాత్రి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదికలో డ్వామా పీడీ, ఏపీడీలు శ్రీలత, వెంకటరమణ, విజిలెన్స్ అధికారి నాగలక్ష్మిల సమక్షంలో తుది నివేదికను వివరించారు. నిబంధనల ప్రకారం పనులు చేయించకపోవడం, కూలీలకు వేసే హాజరులో అవకతవకలు, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, మొక్కల పోషణ నిర్వహణ లోపం, ఎంపీడీఓ సంతకం చేయాల్సిన చోట రబ్బరు స్టాంప్ సంతకాలు వేసి వేతనాలు చెల్లించడం వంటి అవకతవకలను గుర్తించారు. రూ. 95 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. రబ్బరు స్టాంపు సంతకం విషయంలో పీఓ, ఏపీఓకి షోకాజ్ నోటీసులు ఇవ్వాల్సిందిగా పీడీ జిల్లా విజిలెన్స్ అధికారులకు సిపార్సు చేశారు.

భవన నిర్మాణాలకు శంకుస్థాపన

జుఝువరం(పామర్రు): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి గ్రామ సచివాలయ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందని పామర్రు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధి జుఝువరం గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్ర, వైఎస్సార్ ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణాలకు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవన సముదాయాన్ని సుమారు రూ.76.75లక్షల అంచనా విలువలతో శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కె. స్వరూపరాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దొంతిరెడ్డి శ్రీరామిరెడ్డి, వైస్ ఎంపీపీ ఏ రమాదేవి, గ్రామ సర్పంచ్ పుట్టి పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు వితరణ

గుడివాడటౌన్ : స్థానిక బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వరస్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులకు భక్తులు విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం బుధవారం తెలిపారు. పట్టణానికి చెందిన రాయల అప్పారావు–నాగరత్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఆంజనేయ రత్నప్రసాద్–వెంకట లలిత కుమారి దంపతులు రూ. 10,116, కోనా స్రవంతి రూ. 10,116, కాగిత రామచంద్రరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు రామకృష్ణ, విజయకృష్ణ రూ 10,116లు అందజేశారని చెప్పారు.

పబ్లిక్ ప్రకటన

దింటకుర్తి శ్రీ వెంకట కాపనరావు S/o భాస్కరరావు గారి పేరున గల క్రయ దస్తావేజు నెం. 2088/2013కు తేది. 22-3-2013 గల ఒరిజినల్స్ పోయినవి. దొరికిన వారు అందచేయగలరు.
పసుమర్తి సూర్యప్రకాష్
అడ్వకేట్, గొడుగుపేట
మచిలీపట్నం, సెల్ : 98661 27508

పుల్లపాడులో కోడిపందేలపై దాడులు

ఏడుగురి అరెస్ట్

పెడన: పుల్లపాడు గ్రామంలో కోడిపందేలు ఆడుతున్న వారిపై పెడన పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ వి. రవిచంద్రకుమార్‌కు అందిన సమాచారంతో దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఒక ఆటో, రెండు పుంజులు, రూ.6,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.